క్లుప్తంగా

సన్మానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్):నగరంలోని స్వర్ణ ముఖి అతిథిగృహంలో వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నేదురుమల్లిని శాలువాతో సత్కరించి ముందస్తుగా ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట విజయ్‌ప్రసాద్, చినబాబు, ప్రతాప్, తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి



నెల్లూరు(అర్బన్): నగరంలోని 18వ డివిజన్ పరిధిలోని సర్వేపల్లి కాలువకట్ట గిరిజన కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ మండలాధ్యక్షుడు చైతన్య కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ చక్రధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. గత మూడేళ్లుగా కాలువ కట్టపై తాగునీటి సమస్య తలెత్తుతోందన్నారు. గత కొన్ని వారాలుగా తాగునీరందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రత్యేకంగా పైపులైన్ వేయించాలని కోరారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

నెల్లూరు(అర్బన్): జిల్లాలో కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతు సంఘాల సమాఖ్య రాష్ట్రాధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందనలో కలెక్టర్ చక్రధర్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు లక్ష గోనె సంచుల ధాన్యం వర్షానికి తడిసిందన్నారు. ప్రధానంగా జలదంకి, బోగోలు, దగదర్తి, కావలి , సంగం, ఏఎస్‌పేట, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో రైతులు ఆరబోసుకున్న ధాన్యం తడిసి పోయిందన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా తక్షణమే తడిసిన ధాన్యాన్ని సేకరించాలని కోరారు. వరితో పాటు పత్తి, శనగ, వేరుశనగ, కూరగాయలు, మామిడి, ఆకుకూరలు, మిర్చి పంటలు దెబ్బతిన్నాయన్నారు. అందుకు సంబంధించి నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని కోరారు.

ఆత్మకూరు సీఐ మృతికి సంతాపం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆత్మకూరు సీఐ మల్లి నాగేశ్వరరావు గుండెపోటుతో సోమవారం ఆకస్మికంగా మృతి చెందడంపై రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం గౌరవ సలహాదారుడు శ్రీహరి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. నాగేశ్వరరావు మృతి పోలీసుశాఖకు తీరనిలోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అపోలోలో అధునాతన డెక్సా స్కానింగ్



నెల్లూరు(అర్బన్): నగరంలోని అపోలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అధునాతన డెక్సా స్కానింగ్ మెషిన్‌ను ప్రారంభించినట్లు ఆ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాంసతీష్ తెలిపారు. సోమవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డెక్సా స్కానింగ్ మెషిన్ వివరాలను ఆయన వెల్లడించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మెషిన్‌ను ప్రారంభించామని తెలిపారు. నెల్లూరు చుట్టుపక్కల జిల్లాల్లో ఎక్కడా ఈ మెషిన్ లేదన్నారు. డెక్సా స్కానింగ్ ద్వారా ఎముకల పటుత్వంతో పాటు కాల్షియం, ఫాస్పేట్, మినరల్స్, తగిన మోతాదులో ఉన్నాయా..లేదా ని..తెలుసుకోవచ్చని తెలిపారు. ప్రధానంగా మెనోపాజ్ దశలోని మహిళలు, మద్యపాన ప్రియులు, విటమిన్ డీ లోపం ఉన్న, స్టిరాయిడ్స్ వాడే, ఆర్థరైటిస్ సమస్యతో బాధపడే వారు ఈ స్కానింగ్ మెషిన్ ద్వారా ఎముకల పటుత్వాన్ని తెలుసుకోవచ్చని వివరించారు. ఆస్పత్రి సీఈఓ నవీన్, ఆపరేషన్ హెడ్ బాలరాజు, హెచ్ఓడీ డాక్టర్ గాయత్రి, వైద్యులు ప్రమేష్, షబానా, అర్షియా, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా...ఉత్సాహంగా..



తొక్కుడు బిళ్ల ఆటలో పోటీపడుతున్న మెప్మా సిబ్బంది, పొదుపు మహిళలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మెప్మా పీడీ రవీంద్ర

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ స్టేడియంలో మార్చి 8 నుంచి 25వ తేదీ వరకు మహిళలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల సహకారంతో మెప్మా ఉద్యోగులు, పొదుపు మహిళలకు స్కిప్పింగ్, లెమన్ అండ్ స్పూన్, తొక్కుడు బిళ్ల, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్స్, తదితర ఆటల పోటీలను సోమవారం నిర్వహించారు. పొదుపు మహిళలు, మెప్మా ఉద్యోగులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు మెప్మా పీడీ రవీంద్ర చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడిలో ఉండే మహిళలకు క్రీడాపోటీలు ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయన్నారు. మెప్మా ఐబీ వంకదారి అంకయ్య, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, టీఎల్ఎఫ్ రూరల్ 1,3 అధ్యక్షులు హరిత, సాధన, సీఓ హైమావతి, సీఎంఎం జరీనా, సీఎల్ఆర్‌పీ సాయి సింధు, కీర్తన, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు సాక్‌రేస్, నీడిల్ అండ్ థ్రెడ్ పోటీలు

మహిళల క్రీడాపోటీల్లో భాగంగా మంగళవారం ఉదయం 9 గంటలకు సాక్‌రేస్, నీడిల్ అండ్ థ్రెడ్ , మ్యూజికల్ చైర్స్, తదితర పోటీలు నిర్వహించనున్నట్లు సెట్నెల్ సీఈఓ, డీఎస్‌ఏ పుల్లయ్య తెలిపారు. మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మసీదుల వద్ద ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న మేయర్ స్రవంతి

నెల్లూరు సిటీ: ఈ నెల 24 నుంచి రంజాన్ మాసం ప్రారంభమవుతున్న సందర్భంగా నగరంలోని మసీదులు వద్ద ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని నగర మేయర్ పొట్లూరి స్రవంతి కార్పొరేషన్ అధికారులకు సూచించారు. సోమవారం మేయర్ కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో కమిషనర్ హరితతో కలిసి ఇంజినీరింగ్, హెల్త్ విభాగాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మసీదుల వద్ద పారిశుధ్యం లోపించకుండా చూడాలన్నారు. మొబైల్‌టాయిలెట్స్, డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలన్నారు. మసీదుల వద్ద కుక్కలు, పందులు, పశువుల సంచారాన్ని నియంత్రించాలన్నారు. ముస్లింలు ఎక్కువగా నివాసం ఉండే ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరాలకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. ప్రత్యేకంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఈ సంతప్‌కుమార్, ఈఈలు సంజయ్, శేషగిరిరావు, హెల్త్ విభాగాధికారులు పాల్గొన్నారు.

యువ సంవాద్ పోటీలకు ఆహ్వానం

నెల్లూరు(మినీబైపాస్): ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నెహ్రూ యువకేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో యువ సంవాద్ ఇండియా–2047 పోటీలను నిర్వహించనున్నట్లు నెహ్రూ యువకేంద్రం డీవైఓ ఏ మహేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్స్ సహకారంతో మే 31న నెల్లూరులో నిర్వహించే పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. పోటీల నిర్వహణకు ఆసక్తి కలిగిన కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్స్ కస్తూర్బా కళాక్షేత్రంలోని నెహ్రూ యువకేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 99635 33440 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(బృందావనం): విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఐ లక్ష్మీనారాయణ కోరారు. పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో సోమవారం నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం 11వ పీఆర్సీ బకాయిలు, డీఆర్‌అరియర్స్‌ను వెంటనే చెల్లించాలన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలుచేయాలన్నారు.పెండింగ్ మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలన్నారు. అసోసియేషన్ కార్యదర్శి వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కుటుంబ నియంత్రణపై శిక్షణ



సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎంహెచ్ఎ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని జిల్లా సర్వజన వైద్యశాలలో పీపీయూనిట్ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కుటుంబ నియంత్రణలోని ఆధునిక పద్ధతులపై పీహెచ్‌సీల వైద్యసిబ్బందికి గత పదిహేనురోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ సోమవారంతో ముగిసింది. డీఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య చేతుల మీదుగా శిక్షణ పొందిన వైద్య సిబ్బందికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ సహన, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి



మాట్లాడుతున్న రైతు సంఘాల నాయకులు

నెల్లూరు(అర్బన్): అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు, సీనియర్‌నాయకుడు చండ్ర రాజగోపాల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఏపీ రైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది బీపీటీ, షుగర్‌లెస్ ధాన్యం ధరలు రైతులకు ఊరటకలిగిస్తున్నాయన్నారు. అకాల వర్షాలతో దళారులు ధాన్యం ధరలు తగ్గించేశారన్నారు. నెల్లూరు మసూరి (34449) రకానికి చెందిన ధాన్యాన్ని దళారులు మరీ తగ్గించి కొనుగోలు చేస్తున్నారన్నారు. కనీస మద్దతు ధర కూడా దక్కడం లేదని విన్నవించారు. అందువల్ల కలెక్టర్ స్పందించి దళారుల ప్రవేశాన్ని అడ్డుకుని ప్రభుత్వ ఆధ్వర్యంలో తక్షణమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నేరుగా ధాన్యాన్ని సేకరించాలని కోరారు. వ్యవసాయాధికారులు ప్రధానంగా వరిపంట నష్టం గురించే నివేదిక తయారు చేస్తున్నారన్నారు. అంతకన్నా ఎక్కువగా మామిడి, పసుపు, మిర్చి, అరటి , బొప్పాయి, నిమ్మ, తదితర పంటలు దెబ్బతిన్నాయన్నారు. పొగాకు రంగు మారిందన్నారు. అందువల్ల దెబ్బతిన్న అన్ని రకాల పంటల రైతులను ఆదుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంగయ్య, పుల్లయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరి గోపాల్, బుజ్జయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సాయిదర్బార్‌లో ఉగాది ఉత్సవాలు

నెల్లూరు(బృందావనం): పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో మంగళవారం నుంచి 28వ తేదీ వరకు ఉగాది మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆ మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 6గంటల నుంచి 28వ తేదీ వరకు ఏడు రోజుల పాటు రేయింబవళ్లు విరామం లేకుండా అఖండ శ్రీసాయినామ సంకీర్తన సప్తాహ మహాయజ్ఞం జరుపనున్నట్లు వివరించారు. తొలుత అఖండజ్యోతి ప్రజ్వలన నిర్వహించనున్నట్లు తెలిపారు.

30,31న శ్రీరామనవమి వేడుకలు

సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఈ నెల 30,31 తేదీలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించనున్నట్లు మధుసాయి తెలిపారు. 30న ఉదయం 5గంటలకు కాకడ హారతి, 6గంటలకు సాయినాథుడికి విశేషాభిషేకాలు, 9గంటలకు శ్రీసాయిసేవాలయంలో సీతారామచంద్రుల కల్యాణం, మధ్యాహ్నం 12గంటలకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5.30గంటలకు విష్ణుసహస్రనామ సామూహిక పారాయణం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకు అఖండసాయి నామసంకీర్తన జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 6గంటల నుంచి షిర్డీ సంప్రదాయంగా సాయినాథుడి దివ్యరథోత్సవం, వెండి పల్లకీ ఉత్సవం, ఫకీరులతో గంధ మహోత్సవం (ఉరుసు),జెండా ఉత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. సాయినాథుని నగరోత్సవం పద్మావతినగర్, బాలాజీనగర్ మెయిన్‌రోడ్డు మీదుగా చిన్నవినాయకుడి గుడి వరకు సాగుతుందన్నారు. అనంతరం బాలాజీ విద్యాలయం, ఏసీనగర్ మెయిన్‌రోడ్డు, కిన్నెరఅపార్ట్‌మెంట్ మీదుగా రాత్రి 12గంటలకు మందిరం చేరుకుంటుందని తెలిపారు. 31న ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శ్రీసాయి సత్‌చరిత్ర అఖండపారాయణం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 9న ఉదయం 9 గంటల నుంచి రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉగాది, శ్రీరామనవమి మహోత్సవాల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మర్యాదపూర్వకంగా..



తాడేపల్లిలోని క్యాంప్ ఆఫీసులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కుటుంబ సభ్యులతో కలిసి సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

–నెల్లూరు(టౌన్)

29,30న రాష్ట్రస్థాయి కర్లింగ్ పోటీలు

నెల్లూరు (టౌన్): జిల్లా కర్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేదాయపాళెంలోని ఎల్ఎల్ఎఫ్ స్కూల్‌లో ఈ నెల 29,30 తేదీల్లో రాష్ట్రస్థాయి కర్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ సెక్రటరీ మనోహర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో కర్లింగ్ శీతాకాల క్రీడల జాబితాలో ఉందని చెప్పారు. జిల్లాలోని 11 ఏళ్లు పైబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా, మిక్స్‌డ్ విభాగంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కర్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు 94902 52821 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని తెలుగుగంగ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సంజయ్‌గాంధీనగర్ విద్యుత్ ఫీడర్‌లో కొత్త టవర్స్‌ను ఏర్పాటు చేస్తున్నందున మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని ఐఈ సెక్షన్ విద్యుత్‌శాఖ ఏఈ లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని సంజయ్‌గాంధీనగర్, ఇందిరాగాంధీనగర్ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

హోంగార్డును బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): వాహనాల తనిఖీల్లో భాగంగా వాహనానికి సంబంధించిన పత్రాలు చూపించాలని కోరిన హోంగార్డును బెదిరించడంతో పాటు అసభ్యపదజాలంతో తిట్టిన వాహనదారుడిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాలు..చిన్నబజారు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏసీ కూరగాయల మార్కెట్ సెంటర్‌లో సౌత్‌ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్సై ఆదేశాల మేరకు హోంగార్డు మణిచంద్ర ఆదివారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో నగరానికి చెందిన హాజీ అనే వ్యక్తి వాహనాన్ని ఆపగా, తన వాహనాన్ని ఆపే అధికారం నీకు ఎక్కడిదంటూ అసభ్యకర పదజాలంతో దూషిస్తూ, ఈ ప్రాంతంలో నువ్వు ఎలా ఉద్యోగం చేస్తావో చూస్తానని హోంగార్డును బెదిరించాడు. దీంతో హోంగార్డు మణిచంద్ర చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం కేసు నమోదు చేశారు.

నేడు ప్రసన్నాంజనేయుడికి విశేష పూజలు

నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని ప్రసన్నాంజనేయస్వామి మందిరంలో మంగళవారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. ఆంజనేయస్వామి జన్మ నక్షత్రం పూర్వాభద్ర స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం రావడంతో ఉదయం 6.30 గంటలకు చందనాలంకారం, 8.30 గంటలకు జామపండ్ల రసంతో అభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పాదర్తి బాలాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కార్పొరేషన్ స్పందనకు 23 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ హరిత

నెల్లూరు సిటీ: కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 23 వినతులు అందాయి. కమిషనర్ హరిత నగర ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీలను సంబంధిత అధికారులకు నిర్దేశించి గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పన్నులను పూర్తిస్థాయిలో చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. ఈ నెల 31లోగా ఏకకాలంలో పన్ను బకాయిలను చెల్లిస్తే వడ్డీ మాఫీ అవుతుందని తెలిపారు. కార్పొరేషన్ సిబ్బంది ఫేస్‌రికగ్నైజేషన్ ద్వారా హాజరు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. అలా చేసుకుంటనే జీతాలు చెల్లింపులు జరుగుతాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్ఈ సంతప్‌కుమార్, ఈఈలు సంజయ్, చంద్రయ్య, శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

స.హ.చటంపై ప్రజల్లో చైతన్యం తేవడమే లక్ష్యం



మాట్లాడుతున్న గుత్తి త్యాగరాజు

నెల్లూరు(బారకాసు): సమాచార హక్కు చట్టాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతం చేయడమే తమ లక్ష్యమని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్(సీసీఆర్) ఏపీస్టేట్ జాయింట్ సెక్రటరీ గుత్తి త్యాగరాజు పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స.హ.చట్టంపై ప్రజలను చైతన్యపరిచేందుకు సీసీఆర్ ద్వారా గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన ప్రభుత్వ కార్యాలయాల్లోని అవకతవకలను స.హ.చట్టం ద్వారా తెలుసుకుని బాధ్యులపై చర్యలు తీసుకునేలా జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తున్నామన్నారు. స.హ. చట్టంపై యువతను చైతన్యవంతం చేసే కార్యక్రమాన్ని మహాయజ్ఞంలా చేపడుతున్నామన్నారు. ప్రభుత్వపరంగానూ స.హ.చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. సీసీఆర్ రాష్ట్ర సభ్యుడు తులసీదాస్, జిల్లా కన్వీనర్ చప్పరం మల్లికార్జున, న్యాయవాది దాసరి సాయిశ్రీనివాసులు, సభ్యులు మనోహర్, వేణు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో అపహరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆస్పత్రి ఎదుట పార్కింగ్ చేసిన ఆటో అపహరణకు గురైన ఘటన నగరంలో చోటు చేసుకుంది. వివరాలు..విడవలూరు మండలం ఊటుకూరుకు చెందిన కొర్రా సుబ్రహ్మణ్యం ఏపీ26టీఎఫ్ 5344 నంబర్ ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 17న తన భార్యకు ఆరోగ్యం సరిలేకపోవడంతో తన ఆటోలో నగరంలోని రామచంద్రారెడ్డి ఆస్పత్రికి తీసుకొచ్చాడు. ఆస్పత్రి ఎదుట ఆటోను పార్కింగ్ చేసి తన భార్యను ఆస్పత్రిలో చేర్పించాడు. రాత్రి 7.30 గంటల సమయంలో భోజనం తీసుకొచ్చేందుకు ఆటో పార్కింగ్ చేసిన ప్రదేశంలో చూడగా కనిపించలేదు. ఆటో కోసం చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో సోమవారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంతపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఉగాది వేడుకలు

నెల్లూరు(బృందావనం): ఉగాది సందర్భంగా రంగనాయకులపేట తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో బుధవారం ఉదయం 8 గంటలకు తిరుమంజనం, సాయంత్రం 6గంటలకు పంచాంగ శ్రవణం, పేట ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ డీ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని కృపకుపాత్రులు కావాలని కోరారు.

సింహపురిధార్మిక సంస్థ ఆధ్వర్యంలో..

బాలాజీనగర్‌లోని వినాయకగుడి ఉగాదిసెంటర్‌లో బుధవారం ఉదయం 8.30గంటలకు విఘ్నేశ్వరపూజ, రుద్రాభిషేకం, పంచాంగ పూజ, వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు సింహపురి ధార్మిక సంస్థ అధ్యక్షుడు ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ సోమవారం తెలిపారు. అనివార్య కారణాలతో సాయంత్రం ఉగాది వేడుకలను రద్దుచేసినట్లు వివరించారు.

కలెక్టరేట్‌లో ప్రత్యేక వైద్యశిబిరం



నెల్లూరు(అర్బన్): కలెక్టరేట్‌లో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. నగరంలోని కిసాన్‌నగర్ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్యసిబ్బంది స్పందన కార్యక్రమానికి హాజరైన వారికి వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ ఫ్లూ వైరస్ వ్యాప్తి నేపథ్యంలో రక్షణకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మాస్క్ తప్పనిసరిగా వాడాలన్నారు. తీవ్రమైన జలుబు, దగ్గు లక్షణాలు కనిపిస్తే తక్షణమే సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తగిన మందులు, విశ్రాంతి తీసుకుంటే ఫ్లూ తగ్గిపోతుందన్నారు.

అసెంబ్లీలో టీడీపీ అరాచకం

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష టీడీపీ సభ్యులు అరాచకంగా వ్యవహరించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాసనసభ స్పీకర్‌పై పేపర్లు విసిరివేయడం, ముఖంపై ప్లకార్డులను ప్రదర్శించడం వంటి దురుసు ప్రవర్తన అప్రజాస్వామికమని ఖండించారు. స్పీకర్‌కు మద్దతుగా పోడియం వద్దకెళ్లిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై దాడికి పాల్పడే సమయంలో వారించేందుకు వెళ్లిన మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్‌ను బుచ్చయ్యచౌదరి కిందపడేలా నెట్టివేయడం అరాచకమన్నారు. బుచ్చయ్య చౌదరి తీరును ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యుల అత్యంత హేయంగా ప్రవర్తించడాన్ని రాష్ట్ర ప్రజలందరూ వీక్షించారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను చూసి తట్టుకోలేక దురుసుగా ప్రవర్తించిన టీడీపీ సభ్యులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

24న ప్రత్యేక స్పందన

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 24న జేసీ కూర్మనాథ్ ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రూరల్ ఇన్‌చార్జి తహసీల్దార్ సుబ్బయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగే ప్రత్యేక స్పందనను రూరల్ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ అరెస్ట్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షరక్ మున్నాను నవాబుపేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ జీఓనంబర్ 1ను రద్దు చేయాలంటూ విజయవాడలో నిర్వహించ తలపెట్టిన ఆందోళనా కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తుండగా ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ స్రవంతి, కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు చేతుల మీదుగా శోభకృత్ నామ సంవత్సర త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్లను సోమవారం ఆవిష్కరించినట్లు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక నెల్లూరు కమిటీ అధ్యక్షుడు సురమౌళి తెలిపారు. అనంతరం ఆయా కార్యాలయాల సిబ్బందికి క్యాలెండర్లను అందజేసినట్లు వివరించారు.

24న మత్స్య జయంతి

నెల్లూరు(బృందావనం): సుజాతమ్మకాలనీలోని శ్రీకృష్ణయోగ మందిరం ప్రాంగణంలోని అష్టలక్ష్మి ఆలయంలో ఈ నెల 24న మత్స్య జయంతి నిర్వహించనున్నట్లు గణపతి సచ్చిదానందస్వామి కృష్ణ జ్ఞాన బోధ సభ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఉదయం 9గంటలకు మత్స్యగాయత్రి మంత్ర హోమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. శ్రీకృష్ణుడు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.

ఏప్రిల్ 21 నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ షో



క్రెడాయ్ ప్రాపర్టీషో బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): నగరంలోని హోటల్ మినర్వా గ్రాండ్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(క్రెడాయ్) ప్రాపర్టీ ఎక్స్‌పో–2023 బ్రోచర్లను సోమవారం ఆవిష్కరించారు. ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ శ్రీనివాసరావు, యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ కే జోగారావు, కెనరా బ్యాంక్ ఏజీఎం శ్రీనివాసకన్నన్ ముఖ్యఅతిథులుగా హాజరై బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా క్రెడాయ్–నెల్లూరు చాప్టర్ అధ్యక్షుడు బీ రామకృష్ణ మాట్లాడుతూ ఏప్రిల్ 21 నుంచి మూడ్రోజుల పాటు కస్తూరీదేవి గార్డెన్స్‌లో క్రెడాయ్ ప్రాపర్టీ షోను నిర్వహించనున్నట్లు తెలిపారు. గృహనిర్మాణాలు, అపార్ట్‌మెంట్లు, లేఅవుట్లు, గృహోపకరణాలకు సంబంధించి బ్యాంకు రుణాలు అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రెడాయ్ నెల్లూరు చాప్టర్ చైర్మన్ పీవీ రాఘవరావు, సెక్రటరీ టీ మధుసూదన్, గ్రీవెన్స్‌చైర్మన్ రాజశేఖర్‌నాయుడు, వైస్‌ప్రెసిడెంట్ ఎం రామమూర్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.